

కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న కాంగ్రెస్ నేత శివకుమార్

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కమలం జెండా ఎగరేయాలి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కమలం జెండా ఎగిరి తీరుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుతం బీజేపీ వైపు చూస్తున్నారని వంద కార్పొరేట్ స్థానాలను కైవసం చేసుకుంటామని ఆయన అన్నారు. శనివారం బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయంలో హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నేత శివకుమార్ తన అనుచరులతో కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో చేరడానికి ముఖ్యంగా యువత ముందుకు వస్తుందని ఇది ఎంత శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకెల దీపక్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, నర్సింగ్ ముదిరాజ్, నరహరి, నర్సింగ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 14 నుంచి మహాభూమి రథయాత్ర

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్య స్థాపనే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఇంటికి సాగనంపడమే ధ్యేయంగా ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి రోజున మాహాహా భూమి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ తెలిపారు. ఏప్రిల్ 14న అదిలాబాద్‌లో ఈ యాత్ర ప్రారంభమై 2028 జూలై 11న హైదరాబాద్ జింఖాన గ్రౌండ్‌లో భారీ బహిరంగసభతో ముగుస్తుందని ఆయన చెప్పారు. శనివారం బర్కత్‌పురాలోని పార్టీ కార్యాలయంలో రథయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రథయాత్ర 33 జిల్లాలు. 612 మండలాలు 12వేల గ్రామాల్లో కొనసాగుతుందని ఆయన చెప్పారు. మూడు సంవత్సరాల మూడు నెలల పాటు ఈ రథయాత్ర సాగుతుందన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం జోనల్ కమిషనర్‌ను కలిసిన అనంతరం వాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. ఇటీవల మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లు భోలక్‌పూర్‌లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారులను ఆదేశించారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ పనులు పూర్తి చేసి, కొత్తరోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేయాలని వాజీద్ హుస్సేన్ కోరారు.

సీఎంపై కేసు నమోదు చేయాలి

చిక్కడపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కేసు నమోదు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ ఆధ్వర్యంలో చిక్కడపల్లి పీఎస్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌ను కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు. అనంతరం పీఎస్ బయట జైసింహ మాట్లాడుతూ పరిపాలన చేతకాకపోవడంతో రేవంత్‌రెడ్డికి ఎటూ దిక్కుతోచక మాజీసీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'వినియోగదారులకు అండగా నిలుస్తాం'

చిక్కడపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల రక్షణకు అండగా నిలుస్తామని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన గోల్కొండ చౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఈట్‌రైట్ ఫుడ్ అనే అంశంపై వినియోగదారుల్లో చైతన్యం కల్పిస్తూ అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. కల్తీ పాల అమ్మకందారులైన నాలుగు ప్రైవేట్ డెయిరీలపై ఫిర్యాదు చేశామన్నారు. దగ్గు మందుల్లో హానికారకాలు, బాటిళ్లపై సమాచారం లేకపోవడం ప్లాస్టిక్ బాటిళ్లలో విక్రయంపై జాతీయ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశామని వివరించారు. అమ్మాయిలను ఆకర్షించి మోసగిస్తున్న స్లిమ్మింగ్ సెంటర్లపై కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఆథారిటీలో ఫిర్యాదు చేశామని వివరించారు.



హోమం చేస్తున్న వీణా పాని శాస్త్రీ

భారతీయ సంప్రదాయం గొప్పది

● ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు

ముషీరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయం గొప్పదని ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ దేవుని తోటలోని ప్రసిద్ధి గాంచిన భవాని శంకర ఆలయంలో వీణా పాని శాస్త్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ అన్న పూర్ణ సమారాధన, అభిషేకం, హోమాలు, అర్చనలు నిర్వహించారు. త్రినాథరావు భక్తిగీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నిబద్ధతకు నిదర్శనం ఎఫ్‌సీఎస్ పీటర్

చిక్కడపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఎస్ పీటర్ నిబద్ధతకు నిదర్శనమని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుసలేం మత్తయ్య అన్నారు. గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎఫ్‌సీఎస్ పీటర్ భౌతిక కాయానికి క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుసలేం మత్తయ్య నివాళులర్పించారు. అనంతరం పీటర్ కుటుంబ సభ్యులు మత్తయ్య పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మత్తయ్య మాట్లాడుతూ ఎఫ్‌సీఎస్ పీటర్ సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ఇజ్రాయిల్ పోచయ్య, బ్రదర్ ఆనంద్, బ్రదర్ బాల్‌రాజ్, బ్రదర్ దివాకర్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సమాధుల తోటలో ఎఫ్‌సీఎస్ పీటర్ అంత్యక్రియలు

చిక్కడపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హెబ్రోను చర్చి ట్రస్ట్ వ్యవస్థాపకలు బ్రదర్ ఎఫ్‌సీఎస్ పీటర్ అంత్యక్రియలు శనివారం సాయంత్రం నారాయణగూడలోని క్రైస్తవుల సమాధుల తోటలో నిర్వహించారు. అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో క్రైస్తవులు సందర్శన నిమిత్తం చర్చి ప్రాంగణంలో ఉంచారు. శనివారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన భౌతికకాయాన్ని చర్చినుంచి నారాయణగూడ వరకు అంతిమయాత్రగా తీసుకెళ్లారు. పీటర్ విశ్రాంత ఉన్నతాధికారి కావడం, హెబ్రోను చర్చి ట్రస్టును స్థాపించి వివిధ హోదాల్లో పనిచేసిన నేపథ్యంలో కడసారి చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు, క్రైస్తవులు తరలివచ్చారు. అంతిమయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవులు భక్తిగీతాలను ఆలపిస్తూ బైబిల్‌లోని వాక్యాలను సువార్తను చాటుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో పీటర్ సతీమణి రాజేశ్వరి, కుటుంబ సభ్యులు, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

గేయకథకు బాటలు వేసిన నారాయణరెడ్డి



గాయనీగాయకులను సన్మానిస్తున్న ఓలేటి పార్వతీశం

చిక్కడపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సినీ పాటలు రాసినవారు ఎందరో వున్నారు. కానీ తెలుగులో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్న కొద్దిమంది సినీ గీత రచయితలలో సి. నారాయణరెడ్డి ప్రముఖులు అని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం అన్నారు. గేయ కథా ప్రక్రియకు బాట వేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన సినారె సాహిత్యం విశ్వజనీనం అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఆర్ట్స్ థియేటర్స్, వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం త్యాగరాయగానసభలో ప్రఖ్యాత కవి డా. సి. నారాయణరెడ్డి తొలి సినీ గీత రచన చేసి 65 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సినారె పాటకు పట్టాభిషేకం పేరిట ఆయన రచించిన పాటలు ప్రముఖ గాయకులు మిత్ర, గీతాంజలి, కృష్ణప్రసాద్, ఇందునయన, మాస్టర్ విజయ్ మధురంగా ఆలపించారు. మాస్టర్ విజయ్ కంటేనే అమ్మ అని అంటే ఎలాను పాడారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ సినారె రచనా వ్యాసంగం ఆరంభించిన తరుణంలో మహామహులు విశ్వనాథ సత్యనారాయణ, రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి వారు ఉన్నారన్నారు. వారిలో తన ప్రత్యేకత నిలుపుకునేందుకు నాగార్జున సాగరం, కర్పూరవసంతరాయలు వంటి గేయ కథా కావ్యాలు రాశారని వివరించారు. ప్రముఖ రచయిత్రి జలంధరచంద్రమోహన్ మాట్లాడుతూ తన భర్త చంద్రమోహన్ సినిమాలలోని పలు పాటలు, విమర్శ సినారె రాసినవి హిట్ అయ్యాయన్నారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ సినారె కార్యక్రమాలకు ఆయన కుమార్తెలు రావడం సంతోషం అన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..?



● రోడ్లను తవ్వి పనులు చేపట్టని కాంట్రాక్టర్

● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

● వెంటనే పనులు చేపట్టాలని ప్రజల డిమాండ్



డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్ల కోసం తవ్వి వదిలేసిన రోడ్లు

కవాడిగూడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు, ల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కవాడిగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కవాడిగూడ ఆర్యసమాజ్ వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్, రోడ్డు ఆధునీకరణకోసం రోడ్లను తవ్వి వదిలేశారు. రోజులు గడుస్తున్నా నిర్మాణ పనులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లను తవ్వి వదిలేయడంతో బస్తీవాసులు రాకపోకలకు ఇబ్బంగా మారింది. కవాడిగూడ కొత్త బజార్ లైబ్రరీ నుంచి ఆర్యసమాజ్ వరకు డ్రైనేజీ పైప్‌లైన్‌తోపాటు రోడ్డు నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు లక్షలు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల దాదాపు నెల రోజుల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్లను తవ్వి వదిలేశారు. కంకర మయమైన రోడ్లపై నడవలేక స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. రాత్రి సమయాల్లో వృద్ధులు చిన్నారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. కాంట్రాక్టర్, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన వెంటనే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయకుండా పనులుచేపట్టి రోడ్డు నిర్మాణం చేపట్టి స్థానిక ప్రజల ఇబ్బందులుతొలగించాలని ఆయన ఆదేశించారు. అయినప్పటికీ అధికారులలో చలనం రాకపోవడం దారుణంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

నిత్యం నరకం అనుభవిస్తున్నాం



కవాడిగూడ కొత్త బజార్ లైబ్రరీ నుంచి ఆర్యసమాజ్ వరకు నూతన డ్రైనేజీ పైప్ లైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకోసం రోడ్లును తవ్వి వదిలేశారు. నెల రోజులుగా నరకయాతన అనుభవిస్తున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నిత్య ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

\- పుష్పలత, స్థానికురాలు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



డ్రైనేజీ పైప్‌లైన్, ససీ రోడ్డు నిర్మాణ పనులకోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రజలను ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే వారు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. వెంటనే కాంట్రాక్టర్ స్పందించకపోతే సమస్యపై జీహెచ్ఎంసీ కమిషనర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

\- రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు తమ పరిధిలోకి రావు. రోడ్లను తవ్వివదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అభివృద్ధి పనులు తమపరిధిలోకి రావు. ఈ విషయంపై కాంట్రాక్టర్ వెంటనే స్పందించి డ్రైనేజీ పైప్‌లైన్ పనులు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేంటనే పూర్తి చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాను.

\- కార్తీక్‌రెడ్డి, బోట్స్‌క్లబ్ డీజీఎం

తెల్లవారు జామున ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

● రెండు గంటల్లోనే కరెంట్‌ను పునరుద్ధరించి అధికారులు



ప్రశాంత్‌టవర్ సమీపంలో కాలిన ట్రాన్స్‌ఫార్మర్

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ మెయిన్‌రోడ్‌లోని ప్రశాంత్ టవర్ ఎదుట శనివారం తెల్లవారు జామున మూడుగంటల సమయంలో ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీ మంటలు చెలరేగి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే స్థానికులు 1912 ఎమెర్జెన్సీ కాల్‌కు ఫోన్ చేయాగా అజామాబాద్ డీఈ పరిధిలోని ఏడీఈ వినోద్, ముషీరాబాద్ ఏఈ సదామలు వెంటనే స్పందించి సిబ్బంది అప్రమత్తం చేసి మంటలు ఆర్పివేయడంతో పాటు రెండు గంటలలోనే మరమ్మతులు చేసి ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోకి వచ్చే బస్తీలకు కరెంట్‌ను పునరుద్ధరించారు. దీంతో ప్రజలు ట్రాన్స్‌కో అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఏడీఈ వినోద్ మాట్లాడుతూ అత్యవసర సమాయాల్లో 1912కు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. వేసవిలో ట్రాన్స్‌పార్మర్‌ల వద్ద చెత్త చెదారం వేయవద్దని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



కవాడిగూడ రోటరీ కాలనీలో కాన్షీరాం జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న ధర్మసమాజ్ పార్టీ నేతలు

ఘనంగా కాన్షీరాం జయంతి

కవాడిగూడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బహుజనులకు కాన్షీరాం మార్గమే రాజ్యాధికారాన్ని అందిస్తుందని పలువరు ధర్మసమాజ్ పార్టీ నేతలు అన్నారు. కవాడిగూడలోని రోటరీలో కాలనీలో శనివారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి హరీష్‌గౌడ్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్‌చేసి కాలనీ వాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల చరిత్ర మైలురాయిగా నిలిచిన బహుజన రాజకీయ యోధుడు కాన్షీరాం అని ఆయన కొనిడారు. కార్యక్రమంలో కవాడిగూడ డివిజన్ ధర్మసమాజ్ పార్టీ ఇన్‌చార్జి సంతోష్ మహరాజ్, నాయకులు శివగౌడ్, రమేష్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ నిధుల ఖర్చుపై అసెంబ్లీలో చర్చించాలి

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కేటాయించిన నిధుల ఖర్చుపై ఎస్సీ ఎస్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చించాలని గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి గుమ్మడి సూర్య కిరణ్ సూచించారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన అధ్యక్షతన ఎస్సీ ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సూర్యకిరణ్ మాట్లాడూతూ భారత రాజ్యాంగం ప్రకారం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. కార్యక్రమంలో మామిడి నారాయణ, మోహన్, రాజేందర్, స్వామి, వేణు. పులి నవీన్, కుమార్, పరమేశ్వరి, రమ, ఉమ, బూమయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ హిందూ శక్తి సేన ఆంధ్రప్రదేశ్ మహామంత్రిగా డాక్టర్ రత్నం

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ హిందూ శక్తి సేన ఆంధ్రప్రదేశ్ మహామంత్రిగా డాక్టర్ యువి రత్నం నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని సంస్థ జాతీయ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ శుక్ల శనివారం ప్రకటించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బాగ్‌లింగంపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ హిందూ శక్తి సేన సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లి చేసిన సేవలను గుర్తించి తనకు ఈ పదవి ఇవ్వడం సంతోషంగాఉందన్నారు.



బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు గోవింద్ నరేష్, గజ్జెల రాజశేఖర్

మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని అన్ని ఉద్యోగాల్లో మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. గజ్జెల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవింద్ నరేష్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణను వర్తింప చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భిక్షపతి, నర్సింహ, మల్లికార్జున్, గండి కృష్ణ, చిలుక ఎల్లయ్య, గోపి, శ్రీనివాస్, దశరత్ పాల్గొన్నారు. ఈ నిరసన ధర్నాకు రాంనగర్ కార్పొరేటర్ రవిచారి పాల్గొని తన మద్దతు ప్రకటించారు.

విద్యార్థులు డిజిటల్ విద్యపై దృష్టి పెట్టాలి

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉన్నత చదువులు చదివే విద్యార్థులు డిజిటల్ విద్యవైపు దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మీసాల అప్పలయ్య సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఎంబీఏ విద్యార్థులకు ఉద్యోగ సంపాదన, ఉద్యోగంలో ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ విద్యకు మంచి ఆదరణ ఉందని ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కస్టడీలో మృతి చెందిన అలకుంట సంపత్ కుటుంబానికి న్యాయం కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ హెచ్చరించారు. శనివారం ఆయన చిక్కడపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన అలకుంట సంపత్ నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో మృతికి కారణమైన పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సంపత్ కుటుంబ సభ్యులకు యాభై లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రజకులకు విద్య, ఉద్యోగాల్లో తగిన వాటా రావాలి

● మెట్టు సాయికుమార్



సదస్సులో మాట్లాడుతున్న మెట్టు సాయికుమార్

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలోని రజకులకు విద్యా, ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాలలో తగిన వాటా లభించేలా తన వంతుకృషి చేస్తానని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రజకుల జనశంఖారావం, ఆత్మగౌరవ సభ, రజక షిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ అధ్యక్షుడు రాజీవ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ రజకులు విద్యా ఉద్యోగ, ఆర్థిక రాజకీయ రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. సదస్సులో అసోసియేషన్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కార్యదర్శి నేరేళ్లకుమార్, రామస్వామి, మహిళా కార్యదర్శులు మంగ, సంధ్యతోపాటు గోపి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బహుజనముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు దాసురాంనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ తదితరులు

విద్య, వైద్యానికి 20 శాతం నిధులు కేటాయించాలి

● బహుజనముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు దాసురాంనాయక్

రాంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద మధ్యతరగతి వర్గాల ప్రజలకు విద్య వైద్యం అందించడానికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు బడ్జెట్ కేటాయించాలని బహుజనముక్తి జాతీయ అధ్యక్షులు దాసురాంనాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర సదస్సు, జాతీయ అధ్యక్షుడు దాసురాంనాయక్‌కు సన్మాన సభ కార్యక్రమం జరిగింది. సదస్సులో దాసురాంనాయక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సదస్సులో పార్టీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, అంజయ్య, కార్యదర్శి ఇనాయక్, జిల్లా అధ్యక్షులు బెటియా నాయక్, శ్రీనివాస్, ప్రసాద్, రాజేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సత్యం

19న చలో పార్లమెంట్

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కోరుతూ ఈ నెల 19న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడ అబినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో అఖిల పక్ష ఎంపీల మద్దతు కూడకట్టడానికి చలో పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.